# పట్టుదల ఉంటే.....

"క్యార్! క్యార్!" ఓ యింట అప్పుడే జన్మించిన ఓ పసికందు ఏడుపు. ఆ ఏడుపు వినబడగానే ఏ యింటయినా అందరూ సంతోషపడతారు. తీపితో నోరు తడుపుకుని ఒకరి సంతోషం మరొకరు పంచుకుంటారు.

కాని ఆ యింట్లో మాత్రం ఆ సంతోషపు జాడలులేవు. పైగా చీకటి కుప్పలా ఆ యింట విషాదం అలుముకుంది. ఆ తల్లి తొలికాన్పు పంట ఆ పసికందు. ఆ తల్లి మనసు సంతోషంతో ఉప్పొంగ లేదు. ఆమె శరీరం ఆనందంతో జలదరించలేదు. ఆ పసికందు ఏడుపుతో ఆ కన్నతల్లి ఏడుపు శ్రుతి కలిపింది. ఆ తల్లి ఏడుపు చూడలేక ఆ యింట్లో అందరూ కన్నీళ్ళు పెట్టుకున్నారు.

అది సుప్రభాతవేళ. వెలుగు కిరణాలు గ్రామ, గ్రామాలను చుట్టు ముట్టుతున్నాయి. కాని ఆ గ్రామంలో అలుముకున్న చీకటిని మాత్రం తొలగించలేక పోతున్నాయి. ఆ గ్రామవాసుల గుండెల్లో గూడు కట్టుకున్న భయాంధకారాన్ని పోగొట్టలేకపోతున్నాయి.

అభం శుభం తెలియని ఆ పసికందు ఏడుపు గణగణమోగిన బడిగంటలా కాసేపటికి ఆగిపోయింది. నిద్రలోకి జారిపోయాడు. ఆ స్వప్నావస్థలో ఏ సుందర దృశ్యం ఆ పసికందు మనోనేత్రాలకు గోచరించిందో ఎర్రని ఆ లేతపెదవులపై ఓ చిరునవ్వు గులాబిలా విచ్చుకుంది. ఆ లేలేత ముఖంలో ఓ కొత్త వెలుగు తలుక్కుమంది. ఆ పసిబిడ్డను తనివితీరా చూసుకున్న ఆ తల్లి మనసు ఇంద్రధనుస్సులా విచ్చుకుంది.

"ఇంత అందమైన బిడ్డను ఈ గ్రామానికి బలి చెయ్యలేను". అంతలోనే ఆ తల్లి గుండె పగిలింది. అప్పుడే అక్కడకు వచ్చిన భర్తను పట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

"పిచ్చిదానా? అనవసరంగా ఏడుస్తావెందుకు? ఎవరి భవిష్యత్తును ఎవరు ఊహించ గలరు? వాడు ఏడ్చినప్పుడు ఏడ్చావు. ఇప్పుడు వాడెలా నవ్వుతున్నాడో

చూడు? నువ్వూ ఆనందించు!" గదిలో నుంచి బయటకు వెళ్ళిపోతున్న భర్తవైపు ఆశ్చర్యంగా చూసింది. "కొందరు కొన్ని విషయాలు సరిగ్గా పట్టించుకోరు? అందుకే ఈ గ్రామం బతుకు ఇలా కొడిగట్టిన దీపమై పోతోంది". ఆమె ఓ వెర్రినవ్వుతో సరిపెట్టుకుంది.

భార్యకు ధైర్యం చెప్పగలిగాడు. నిజానికి అతనికీ లోపల ఏమాత్రం ధైర్యం లేదు. ఆ వూరికి మంచిరోజులు వస్తాయా లేదా? అతని ఆలోచనకు అందని సమస్య అది. అతని మనసంతా వికలమై పోయింది. అనాలోచితంగా బయటకు వెళ్ళిపోయాడు.

అంతలో అత్తగారు ఆ గదిలోకి వచ్చింది. పురిటి మంచానికి దగ్గరగా వెళ్ళింది. ఆమె నోరు మెదపనేలేదు. చంప కళ్ళలో నీరు ధారలు కట్టింది.

"బిడ్డా! ఎందుకు దుఃఖపడతావు? నారు పోసినవాడు నీరు పొయ్యడా? ఏదో దారిచూపించక పోడు?" అంది అత్తగారు. "ఆ పోస్తూనే ఉన్నాడు. నీరు తాగితే నోరు చేదుకాదు. శరీరమే విషమైపోతోంది. ఏడవక ఏం చెయ్యమంటావు? ఈ చిన్నపిల్లల బతుకులు ఏమవుతున్నాయో నీకు తెలీందేముంది? అత్తమ్మా!" అంటూ చంప వెక్కి వెక్కి ఏడ్చింది.

"తెలీకేమి? అన్నీ తెలుసు! రోజులు ఇలాగే ఉండిపోవు. తప్పకుండా మనకి మంచిరోజులొస్తాయి. అనవసరంగా ఏవేవో ఊహించుకుని బాధపడబోక! వెనుకటికి నీలాటిదే ఒకామె ఆరుబయట మంచమేసుకుని కూర్చుని ఏడుపు మొదలు పెట్టిందట! ఏమిటని అడిగితే ఆకాశం వైపు చూపిస్తూ అది ఎప్పుడు విరిగి మీద పడుతుందోనని ఏడుస్తున్నా అందట! అలాగుంది నీ ఏడుపు".

"అది కాదత్తమ్మా! అత్త మాటలకు చంపకు నవ్వు వచ్చింది. అయినా నువ్వు దాచుకుంటూ ఏదో చెప్పబోయింది.

"ఇంకేం చెప్పకు! నీ బిడ్డ పెరిగి అడుగు వేసే నాటికి ఎన్ని మార్పులు వస్తయో? కళ్ళు మూసుకుని కాసేపు పడుకో! అన్నీ మర్చిపోతావు'ఆ మాటలు చెప్పి ఆవిడ అక్కడనుంచి వచ్చేసింది.

ఆవిడ మాటలతో చంప మనసు కాస్త తేలికైంది. నిద్రిస్తున్న పిల్లాడిని మరింత దగ్గరగా జరుపుకుంది. పిల్లాడి నడుంచుట్టూ చెయ్యివేసి కళ్ళు మూసుకుంది. మగత నిద్రలో ఓ భయంకర దృశ్యం ఆమె కళ్ళముందు కదలాడింది. అది కల అనడానికి

వీలులేదు. ఆమె మనసులోని అనుమానం. అది ఆమెలో గూడుకట్టుకున్న భయం. "సాయంసంధ్య నీరెండలో పిల్లలందరూ ఆడుకుంటున్నారు. ఆ పిల్లలందరూ అవిటివారే. ఒకరికి కాలు వంకర, మరొకరికి చేతులు వంకర. కొందరికి నడుము వంకర. మరికొందరు బక్కచిక్కి నీరసపడినవారు. అందులో ఒకడు తన ముద్దుల తనయుడు".

చంప ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. పక్కలోని పిల్లాడిని పరిశీలనగా చూసింది. వాడు బుసలు కొడుతూ నిద్రపోతున్నాడు. మధ్య మధ్యలో చిద్విలాసంగా నవ్వుకుంటున్నాడు. భయకంపితయైన ఆమె తిరిగి కుదుట పడింది. కానీ అది కలకాదు. కళ్ళ ముందు కదలాడిన యథార్థం. అది ఆమెకే కాదు. ఆ వూరి వారందరికీ తెలుసు. సాధ్యం కానిదైన మనిషి సాధ్యం చేసుకోవాలనుకుంటాడు. దానికోసం ప్రయత్నం చేస్తూనే ఉంటాడు. ఋతువులు మారుతున్నాయి. సంవత్సరాలు మారుతున్నాయి. తరాలు మారుతున్నాయి. ప్రయత్నం సాగుతూనే ఉంది. ఏదో గుడ్డి దీపంలా ఆశ ఆ వూరి వారిని వెంటాడుతూనే ఉంది.

ఆ ఆశతోనే ఆ పిల్లాడిని అల్లారు ముద్దుగా పెంచుతున్నారు. పిల్లాడు కాళ్ళు, చేతులు ఆడిస్తూ ఆడుకుంటుంటె చంప ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతోంది. ఊరిలోని పిల్లల సంగతి తలుచుకుంటుంటే గుండెల్లో రాయిపడుతోంది.

పిల్లాడు బోర్లా పడుతున్నాడు. పండులా, గుండులా ఉన్న ఆ పిల్లాడిని అందరు ఎంతో ముద్దు చేస్తున్నారు.

"చంపా నువ్వు అనవసరంగా భయపడుతున్నావుగానీ! చూడవే వీడు పేరుకు తగట్టు బాలగోపాలుడిలాగే ఉన్నాడే!" అత్తగారి మాటలకు చంప కొడుకు వైపు గర్వంగా చూసి ముసిముసి నవ్వులు నవ్వుకుంది.

"చంపా! నీ మరిది పెళ్ళి సంగతి కాస్త ఆలోచించవే? వీడికి అసలు పెళ్ళవుతుందనిపించడం లేదు. వీడికే కాదే ఈ వూళ్ళో ఉన్న కుర్రాళ్ళవరికీ పెళ్ళవుతుందనే ఆశ లేదు. అందరూ బ్రహ్మచారులుగా ఉండిపోవలసిందేమో?".

"అదేమిటత్తా! అంత మాటన్నావు. మరిదికి ఏంలోటని?"

"వాడికి లోటుందని కాదు చంపా! ఈ వూరికి ఉన్నలోటే? ఎందరో పిల్లనిస్తామని ఈ ఊరు వచ్చిన వారంతా తిరిగి వెళ్ళిపోతున్నారు. ఏ ఆడపిల్లా ఈ వూరి కుర్రాళ్లని పెళ్ళి చేసుకుని ఇక్కడ ఉండటానికి ఇష్టపడటం లేదు? అదే బాధగా ఉంది".

"అదేమిటి? అలా అంటావు అత్తా! మరిది చాలా బుద్ధిమంతుడు, తెలివైనవాడు. ఒక్కళ్ళిద్దరు చేసుకోనంటే ఇంక పెళ్ళే కాదనుకుంటే ఎలా? నాలాంటి ఆడపిల్లలు ఎక్కడో అక్కడ పుట్టే ఉంటారు".

ఆ ఆడపిల్ల ఎక్కడుందో కనపడాలిగా? ఆ వెతికే పూచీ నీదేనే" ఎవరో పిలుస్తుంటే ఆవిడ అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

"అవును ఈ వూరి మగవారికి పెళ్ళిళ్ళు కాకపోవడమే మంచిది. నేనే వెతకాలట. లేకపోతే మరిదికి పెళ్లికాదుట. అలాగే కావాలి. నేను బుద్ధిలేక అజ్ఞానంతో ఈ వూరు వచ్చిపడ్డాను. ఈ దురదృష్టం మరే ఆడపిల్లకు పట్టకూడదు?"

చంప మనస్సు మరింత రగిలింది. ఆ వూరు మీద మరింత కసి పెరిగింది.

ఆ రోజు రాత్రి మరో యింట్లో 'క్యార్! క్యార్!' మంటూ అప్పుడే పుట్టిన మరో పసికందు ఏడ్పు. ఆ ఏడ్పు ఊరంతా మారుమ్రోగింది. చంప గుండెల్లో మరో రాయిపడింది. అయ్యో బిడ్డా! ఈ వూరి పిల్లల్లాగె నీకేంగతి పడుతుందో. కన్నతల్లిని జన్మభూమిని మించిన స్వర్గం ఈ ప్రపంచంలో ఏదీ లేదంటారు? కాని ఈ జన్మభూమే విషసర్పమై కాటేస్తోంది. పసి బిడ్డల జీవితాలతోనే ఆడుకుంటోంది. పండులా ఉన్న ఈ బిడ్డ గతేమిటో? చంప పసివాడిని హృదయానికి హత్తుకుంది. దుఃఖం ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చింది.

అప్పుడే అక్కడకు వచ్చిన భర్త ఆనంద్‌ను పట్టుకుని మరింత ఏడ్చింది.

"ఈవూరు వదలి వెళ్ళిపోదాం! మన బతుకు బండలు కాకుండా ఈ వూరు వదలి వెళ్ళిపోదాం!"

వెర్రిదానా! ఈ వూరు వదలి ఎక్కడికి వెళ్ళగలం? మనం ఎలా బతకగలం? మాకా ఎక్కువ చదువుల్లేవు. ఇక్కడ ఈ నేలను దున్నుకుని బతుకుతున్నాం. అయినా మన బిడ్డను పట్టుకుని పారిపోతే మిగిలిన బిడ్డల సంగతేమిటి?

"అదంతా నాకు తెలీదు! నా కన్న బిడ్డ నాకు ముఖ్యం. ఇంత అందంగా గుమ్మడిపండులా ఉన్న ఈ పసి బిడ్డను ఎన్నాళ్ళు కాపాడుకోగలం?"

"తప్పకుండా కాపాడుకోగలం. మన వూరికి నిజంగానే మంచిరోజులు వస్తున్నాయి! ఇంజనీర్లు వస్తున్నారు. మనవూరికి కొత్త కాలువలు వేస్తారట! అవన్నీ పరిశీలించడానికి రిపోర్టులు వెలితే పని ప్రారంభిస్తారట!"

"నన్ను నమ్మమంటారా?"

"ఇది నమ్మాలి చంపా! నిజంగానే మనవూరికి ఆ కాలువల ద్వారా మంచినదీజలాలు వస్తాయట!"

"నేను నమ్మను. ఇదివరలో కూడా శాస్త్రవేత్తలు నాలుగుసార్లు వచ్చి వెళ్ళారు. ఇక్కడి నీళ్ళను పరిశీలించారు. ఒక ప్రాజెక్టు ప్రారంభిస్తామన్నారు. ఫ్లోరిన్‌తో మురిగిపోతున్న నీటిని ప్రక్షాళనం చేస్తామన్నారు. కాని ఏమయింది? ప్రాజెక్టులు కాగితాల పాలయ్యాయి. ఆశలన్నీ నిరాశలయ్యాయి. రోజు రోజుకి పిల్లలు అవిటి వారవుతున్నారు. పసిపిల్లల్ని చూడలేక తల్లులు తల్లడిల్లిపోతున్నారు. ఈ ఇంజనీర్ల రిపోర్టుల వల్ల జరిగేదేముంటుంది?"

"చంపా అంత నిరాశ పనికిరాదు. ఈ సారి నిజంగా మంచి నీరు లభిస్తుంది. అనవసరమైన బెంగలు ఇంకవదిలేసెయ్యి" అన్న భర్త మాటలు విన్నాక తిరిగి చంపలో ఏదో ఆశ ఓ వెలుగు వెలిగింది. భర్త చెప్పిన మాటల్లో నిజం ఉందేమో అనిపించింది.

ఆ రోజు రానే వచ్చింది. ఆ ఇంజనీర్లకు స్వాగతం పలకడానికి ఊరంతా మావిడాకు తోరణాలు కట్టారు. 'స్వాగతం' అని రాసి అక్కడక్కడ బ్యానర్సు పెట్టారు. ఊరి మధ్యలో షామ్యానాలు వేసి వేదిక కట్టారు. పెండ్లి మండపాల్లా అలంకరించారు. ఊరంతా ఒకటే సందడి. వారు రాగానే సన్నాయి మేళంతో వేద మంత్రాలతో వారికి స్వాగతం పలికారు. ఇంజనీర్లు ప్రజలమొర విన్నారు. వారు చెప్పింది విని ఆలోచించారు. వారు జీపులతో ఊరు చుట్టూ తిరిగారు. పక్కగ్రామాలు కూడా పరిశీలించారు. కొలతలు వేశారు. ఎటు నుంచి కాలువ తవ్వాలో అంతా ప్లాను గీశారు. కాలువలు తవ్వడం ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

పొద్దుట మొదలు పడిగావులువడి ఎండలో వారి వెంట ఉన్న మండలాధిపతులు, సర్పంచులు, మాజీ అధ్యక్షులు, పంచాయతీ ప్రెసిడెంటులు ఊపిరి పీల్చుకున్నారు. వారి శ్రమ ఫలించిందనుకున్నారు. నదీజలాలు తీసుకువచ్చిన ఘనత వారికే దక్కుతుందనుకుని భుజాలు ఎగరేసుకున్నారు. ఇంజనీర్లు 2 గంటలు ఆలస్యంగా వచ్చిన శ్రమంతా మర్చిపోయారు. తగిన విధంగా విందులు ఏర్పాటు చేసి వారిని సాగనంపి ఊపిరి పీల్చుకున్నారు.

వారు చెప్పినట్టుగానే కాలువలు తవ్వడం మొదలు పెట్టారు. వూరికి ఉత్తరాన పెద్ద పెద్ద గోతులు, మట్టి దిబ్బలు అటునుంచి గ్రామ ప్రజలు నడవడమే కష్టమైపోయింది. అంతే పని ఆపేశారు. ఎందుకు ఆగిపోయిందో ఎవరికీ తెలీదు.

డబ్బు శాంక్షన్ కాలేదన్నారు కొందరు. కాంట్రాక్టర్లు మారారట అన్నారు కొందరు. నదీజలాలు రావడానికి నదుల్లో నీరేలేదట... అన్నారు కొందరు. ఏదైతేనేమి కాలువ పనులు ఆగిపోయాయి. ఆ వూరి ప్రజల ఆశలు అడియాసలయ్యాయి.

ఆ మధ్యాహ్నం వేళ ఎండ మండిపోతోంది. "క్యార్! క్యార్!" మంటూ ఓ యింట అప్పుడే పుట్టిన ఓ పసిబిడ్డ ఏడుపు. పట్టపగలు ఓ గుడ్లగూబ అరుపులా అందరికి వినబడింది. చంప గుండె ఓ క్షణం ఆగి మళ్ళీ కొట్టుకుంది.

"చంపా నీ మరిది పెళ్ళి సంగతి చూడమన్నాగా? నీకేమి చక్కటి పండు లాంటి కొడుకు పుట్టాడు. వాడికి పెళ్ళాం, కాపురం లేవు కాస్త తొందరపడు! అయినా ఆ వచ్చిన సంబంధం నీకు చుట్టమేనటగా మీ చిన్నాన్న కూతురేనటగా వెళ్ళి మాట్లాడిరా!" అంది అత్తగారు సాగదీస్తూ! ఒక విధంగా అది అత్తగారి ఆజ్ఞలా వినబడింది.

"అలాగే అత్తమ్మా! తప్పకుండా వెడతా" సమాధానమిచ్చింది చంప.

చంపకు రానురాను ఆ వూరి మీద ఆ అత్త మాటలమీద కోపం పెరుగుతోంది. మనసులో చెప్పలేని బాధ. అది కోపంగా, కసిగా మారుతోంది.

ఓ రోజు ఆ వూళ్ళో యువతరమంతా ఒక చోట సమావేశమయ్యారు. అందరూ పెళ్ళికానివారు కారు. కొందరు పెళ్ళయినవారు ఉన్నారు.

"పొరుగూరు వెళ్ళి చదువుకుని ఉద్యోగాలు చేసుకున్న వారి బతుకులు హాయిగా ఉన్నాయి. పిల్లా, పాపలతో సుఖంగా ఉన్నారు. ఈ నేలను నమ్ముకుని ఇక్కడున్న వారికే ఈ బాధలు" అన్నారు కొందరు విరక్తిగా.

"అసలు మనం పెళ్ళిళ్ళే చేసుకోకూడదు" అన్నారు పెళ్ళికానివారు.

"అసలు మనం సంతానమే కనద్దు! అప్పుడు మనకీ బాధలుండవు అన్నారు" పెళ్ళయిన కొందరు యువకులు.

ఈ యువకుల నిర్ణయాలు విని పెద్దలు చాలా బాధపడ్డారు. కాని వాళ్ళు మాత్రం ఏం చెయ్యగలరు? వారిని సమాధానపరచలేక ఊరుకున్నారు.

చంప కొడుక్కి పదినెలలు వచ్చాయి. అత్తా, తాతా అంటున్నారు. పట్టుకుని నుంచుంటున్నాడు. తప్పటడుగులు వెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు. చంప దృష్టి అంతా వాడిమీదే ఉంది. రోజు పొద్దుటలేవగానే వాడి కాళ్ళు చేతులు సరిగా ఉన్నాయో లేదో చూసుకుంటోంది.

ఆ రోజు సాయంకాలం మబ్బుగా ఉంది. ఓ మూల వర్షకాలం. చంప పిల్లాడిని వీధి అరుగు మీద ఒళ్ళో కూర్చోపెట్టుకుని కూర్చుంది. చల్లగాలి జోరుగా వీస్తోంది. వాడు ఆనందంతో చప్పట్లు కొడుతూ తల్లిని మురిపిస్తున్నాడు.

పిల్లలందరు బిలబిలమంటు ఇళ్ళలోంచి బయటకు వచ్చారు. అంతలో సన్నని చినుకులు ప్రారంభమయ్యాయి. కొందరు కాళ్ళు వంకర మూలంగా తప్పటడుగులు వేస్తునే ఆడుతున్నారు. "వానావానా చెల్లప్పా" అంటూ గంతులేస్తున్నారు. చేతులు వంకరున్నా ఆ చేతులతోనే చప్పట్లు కొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. నడ్డివంకర ఉన్నవారు ఎత్తెత్తి అడుగులు వేస్తూ ఆడుతున్నారు. కొందరు బక్కచిక్కిన బడుగు దేహాలతో ఆడుతుంటే అస్తి పంజరాలు గాలిలో ఊగుతున్నట్లు ఉంది. చంప మనస్సు వికలమై పోయింది. ఆ దృశ్యం చూడలేకపోయింది.

ఆ పిల్లలు హాయిగా పుస్తకాల సంచి భుజాన వేసుకుని బడికి నడుచుకుంటూ వెళ్ళలేరు. అందరిలా పరుగులు పెట్టలేరు. అది కలకాదు. అది యధార్థ దృశ్యం. అంతలో గోపాల్ అనే పిల్లాడు జారిపడిపోయాడు. "అమ్మా!" అంటు బాధతో గిలగిల లాడాడు. చంప చంకలో కొడుకు నేసుకునే వాడిని లేవదీయడానికి పరుగెత్తింది. వాడిని లేవతీసింది. వాడు "అమ్మా నొప్పి" అంటూ కాలు పట్టుకుని బాధతో మెలికలు తిరుగుతున్నాడు. అంతలో వాళ్ళమ్మతోపాటు అందరూ పరుగులు పెడుతూ వచ్చారు. వాడిని దూరంగా ఉన్న పట్నం ఆసుపత్రికి తీసుకుని బయలుదేరారు.

"అవిటి పిల్లల్ని కాస్త జాగ్రత్తగా చూసుకోవాలి?" కొందరు ఆ తల్లినే మందలించారు."

డాక్టరు పిల్లాడి కాలును జాగ్రత్తగా పరిశీలించి చూసి కాలికి ఫ్రాక్చరు అయ్యిందని బ్యాండేజ్ వేశాడు డాక్టర్. అది అసలే అవిటికాలు. అతుక్కోడం చాలా కష్టమన్నాడు డాక్టరు. ఆ తల్లిదండ్రులని ఎవరూ ఓదార్చలేకపోయారు. ఇంటికి తిరిగి బయలుదేరి వచ్చేసారు. మరునాడు చంప ఆ పిల్లాడిని చూడ్డానికి బయలుదేరింది. చంపని చూడగానె ఆ తల్లి దుఃఖం కట్టలు తెంచుకు వచ్చింది.

"చంపా! ఇంక నువ్వు ఈ వూరు వదలి వెళ్లిపో! నీ పుట్టింటికి చేరుకో! కలోగంజో తాగి బతకవచ్చు! ఈ నీళ్ళు తాగించి పిల్లాడిని అవిటివాడిని చెయ్యకు. నా మాట విను! చంపా!" ఆ తల్లి చంపచేతిని తన చేతిలో వేయించుకుంది.

చంప మనసు ఒక నిర్ణయానికి వచ్చేసింది. ఒక దృఢ నిశ్చయమది.

"చంపా! ఎప్పుడు బయలు దేరుతావే? నీ పినతండ్రి కూతురితో మాట్లాడి లగ్నం పెట్టించుకు మరీరా!" అంటూ అత్తగారు కాస్త గట్టిగా చెప్పింది?

"ఈ రోజే బయలు దేరుతున్నా అత్తా! తప్పకుండా లగ్నం పెట్టించుకు మరీ వస్తా!"

"చంప చురుకైంది! ఏ పనైనా సాధించగలదు" అత్త మురిసిపోయింది. "మళ్ళీరానట్టు అన్ని బట్టలెందుకు మోసుకెళుతున్నావే?" అత్త అడగబోయి ఊరుకుంది. చంప నవ్వుతూనె మరేం చెప్పకుండా బయలుదేరింది. అత్తింటి రుణం తీరిందనుకుంది మనస్సులో!

చంప చంటివానితో పుట్టింట్లో అడుగు పెట్టింది. బిడ్డతో వచ్చిన ఆమెను చూసి తల్లిదండ్రులు, చెల్లెళ్ళు, తమ్ముళ్ళు చుట్టుముట్టారు. చంప కూడా వారిని ప్రేమగా పలకరించి వారిని వదలలేదు.

చంప తను వచ్చిన పని చెప్పింది. చిన్నాన్నతో, కూతురితో తన మరిది పెళ్ళి విషయం మాట్లాడాలంది. "నేను ఇక్కడే ఉండిపోతా మరి, ఆ వూరు పోను" అన్న మాట మనసులోనే దాచుకుంది.

"దానికేం అలాగే మాట్లాడుదాం!" అన్నాడు తండ్రి.

భోజనాలు అవి పూర్తి చేసుకుని అందరు బయలుదేరారు.

చంప ముందు పెళ్ళి పిల్లతో మాట్లాడాలంది. ఆమె ఉన్న లోపలి గదిలోకి వెళ్ళింది.

"అంబా! నీకు నా మరిదిని పెళ్ళి చేసుకోవాలని ఉందా? ఉంటే ఆ వూరి పరిస్థితి నువ్వు తెలుసుకోవాలి. అక్కడ తాగే నీటినిండా ఏదో విషం ఉంది. అక్కడ పుట్టిన పిల్లలంతా కాళ్ళు, చేతులు, నడుము, శరీరము అన్నీ అవిటిగా మారి బాధపడుతున్నారు. నీకు తెలుసా?"

"చంపక్కా! నాకు అన్నీ తెలుసు!"

"అంబా! ఎవరూ ఆ వూరి మగపిల్లలకి పిల్లనివ్వడం లేదు. ఏ ఆడపిల్ల పెళ్ళి చేసుకోవడానికి ముందుకు రావడంలేదు".

"అక్కా! కావచ్చు. కాని నేను నీ మరిదినే పెళ్ళి చేసుకుంటా!"

"అదేమిటే? వాళ్ళు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఏదీ ఫలించలేదు. ఆ నీరు మారదు. నేనే పిల్లాడితో ఇక్కడే వుండి పోవాలని వచ్చా".

"చంపక్కా! నువ్వలా అనకు. అక్కడ నీళ్ళలో ఫ్లోరిన్ ఎక్కువ ఉంది. నాకు తెలుసు నీ పిల్లాడి కోసం నువ్వు పారిపోయి వస్తే మిగిలిన వారి సంగతి ఏమిటి?

"అంటే?"

"అంటే ఏమిటి? మనమంతా పట్టు పట్టి సాధించాలి. కొత్త నదీజలాలు వచ్చేటట్టు చూడాలి! పట్టుదల ప్రధానం. నేను మీ మరిదినే పెళ్ళాడుతా!" అంబ మాటలకి, పట్టుదలకి చంప అవాక్కయింది.

"నిజమే వూరికి మంచి రోజులు వస్తాయేమో?" తిరిగి ప్రయాణమయింది చంప. "పట్టుదలతో స్వరాజ్యమే సాధించుకున్నాం ఇదెంత" అనుకుంది మనస్సులో.

*నేటి నిజం. దీపావళి ప్రత్యేక అనుబంధం 2004.*